ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3

బాపట్ల జిల్లా వార్తలు

శనివారం 15 మార్చి 2025



భక్తుల కోసం సిద్ధం చేసిన గ్యాలరీలు



భక్తులకు అందించటానికి పసుపు, కుంకుమ, పసుపు, దారం ప్యాకెట్‌లను సిద్ధం చేస్తున్న సేవకులు

6

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

శ్రీవారి కల్యాణోత్సవానికి రాజధాని అమరావతిలోని వెంకటపాలెం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సిద్ధమైంది. ఆలయ ప్రాంగణంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించనున్నారు.



హోలీ.. ఆనందాల కేళి

రంగుల పండుగ హోలీ.. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరిగింది. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ ఆడిపాడారు.

- గుంటూరు(తూర్పు)

6

ఇళ్లు సరే.. సౌకర్యాలు?

సమస్యల వలయంలో టిడ్కోలు

- నివాసానికి ఇష్టపడని లబ్ధిదారులు
- వసతుల కల్పనపై అధికారులు మీనమేషాలు
- తాగునీటికి కటకట..డ్రెయినేజీ అధ్వానం.. అపరిశుభ్రత
- నాడు హడావుడి గృహ ప్రవేశాలు.. నేడుపట్టించుకోని పాలకులు



అద్దంకి : శింగరకొండ సమీపంలో అసంపూర్తి పనులతో నిలిచిన టిడ్కో ఇళ్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎనిమిదేళ్లకుపైగా నిరీక్షణకు తెరపడి ఇళ్లల్లో చేరినా.. ఆ ఆనందం ఆవిరైపోతోంది. గత టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించగా వైసీపీ వాటిని పాడుపెట్టి ఎన్నికలకు ముందు లబ్ధిదారుల చేత హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించారు. అయితే కనీస సౌకర్యాలు సమకూర్చకుండా ఎన్నికల్లో లబ్ధి కోసం నాటి పాలకులు లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వగా ప్రస్తుతం వాటి పరిష్కారంపై పాలకులు దృష్టి సారించడంలేదు. తాగునీటి, డ్రెయినేజి, అపరిశుభ్రత, విద్యుత్, రవాణా తదితర సమస్యల్లో టిడ్కో ప్రాంగణాలు నిండిపోయాయి. వందల సంఖ్యలో గృహస్తులు ఉంటున్నా తాగునీరు అంతంత మాత్రంగా సరఫరా చేస్తున్నారు. దీంతో తాగునీటితో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని చోట్ల అయితే సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో ఉండేందుకు ముందుకు రావడం లేదు. టిడ్కో ఇళ్లల్లో లబ్ధిదారులు ఎందుకు ఉండటం లేదు.. అక్కడ నెలకొన్న సమస్యలు ఏమిటి.. ఇంకేమైనా సదుపాయాలు కల్పించాలా.. అన్న ఆలోచన కూడా అధికారులు చేయడంలేదు. ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నా టిడ్కో ప్రాంగణాల్లోని సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.

భయం.. భయం

తెనాలి సమీపంలోని జగ్గడిగుంటపాలెం టిడ్కో ప్రాంగణంలో ఇటీవల ఓ గృహంలో విషసర్పం ప్రవేశించి గృహిణిని కాటు వేసింది. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కాటు వేసిన ప్రాంతం నుంచి విషం పైకి పాకకుండా తాడుతో కట్టుకట్టుకుని భర్త సాయంతో దాదాపుగా 6 కిలోమీటర్లు ద్విచక్రవాహనంపై తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్న పరిస్థితి. ఈ పరిణామంతో ఇక్కడ లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో నివాసానికి సాహసించడంలేదు. ఇదే పరిస్థితి గృహ ప్రవేశాలు జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ నెలకొంది. అపరిశుభ్రత కారణంగా దోమలతో ప్రజలు పగలు కూడా అల్లాడి పోతున్నారు. గుంటూరు అడవితక్కెళ్లపాడులో గత వైసీపీ ప్రభుత్వం కల్పించిన విద్యుత్ సదుపాయాలు నాసిరకంగా ఉండటంతో భూగర్భంలోని వైర్లు తెగి ప్రాణాంతకంగా మారుతుండటంతో మంటలు రేగి ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో లబ్ధిదారులు భయం భయంగా ఉంటున్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని దొండపాడులోని టిడ్కో ప్రాంగణం చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.



తెనాలి టిడ్కో గృహాల్లో పాము కాటుకు గురైన మహిళ

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాల్లో పేదల అద్దె ఇళ్ల కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో షేర్‌వాల్ టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను నిర్మించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు మున్సిపల్ కేంద్రాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మించారు. చాలా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగి గృహ ప్రవేశాలకు సిద్ధమవగా 2019లో ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో లబ్ధిదారుల ఆశలు ఆవిరైపోయాయి. కళ్లెదుట ఇళ్లు కనిపిస్తున్నా వాటిని వైసీపీ పాలకులు 2024 ఎన్నికల ముందు వరకు పాడుపెట్టారు. లబ్ధిదారులు, ప్రతిపక్షాలు ఎన్ని ఆందోళనలు చేసినా టిడ్కో ఇళ్ల గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయరన్న ఉద్దేశంతో హడావిడిగా టిడ్కో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. దీంతో 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లా, సీఆర్డీఏ సహా 12 పట్టణాల్లో 32,304 టిడ్కో ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 22,068 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అయితే పెండింగ్ పనులు చేపట్టకుండా రంగులు వేసి ఇళ్ల తాళాలను నాడు వైసీపీ హయాంలో అప్పగించారు. గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేట, మంగళగిరి, సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాల్లో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లల్లో చేరారు. అయితే తాము చేరిన ఇళ్లు రంగులు మయంగా కనిపిస్తున్నాయే కానీ అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజి, అపరిశుభ్రత, రవాణా సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఆయా ఇళ్లల్లో ఉండలేక గత ఏడాదిన్నరకు పైగా లబ్ధిదారులు అల్లాడుతున్నారు. గృహప్రవేశాలతో బాధ్యత ముగిసిందన్నట్లు నాడు వైసీపీ హయాంలో అధికారులు వ్యవహరించగా నేడూ అదే తీరు ఈ ప్రభుత్వంలోనూ నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీటి సరఫరా, చెత్తాచెదారాల తొలగింపు లేక, అత్యవసరమైతే వైద్యం, పిల్లల చదువులకు పాఠశాలలు, రేషన్ సరుకులు అందక ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూస్తున్నా పది నెలలుగా (మిగతా 6వ పేజీలో)



రేపల్లెలో టిడ్కో గృహాల దుస్థితి



గుంటూరులోని టిడ్కో ఇళ్లపై నిర్మించిన నీళ్ల ట్యాంకులు

అధికారులు సరఫరా చేస్తున్న మురుగు నీరు..

గుంటూరులో గంటే.. అదీ మురుగునీరు

గుంటూరు అడవితక్కెళ్లపాడులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా అందక అల్లాడుతున్నారు. 4,192 కుటుంబాలకు రోజుకు ఒక్క గంట మాత్రమే నీరు వదులుతున్నారు. పదహారు ప్లాట్లకు ఒక నీళ్ల ట్యాంకు నిర్మించగా, 6 అడుగుల లోతులో ఉండే ఆ ట్యాంకుల్లో రెండడుగులకు మించి నిండటంలేదు. ఆ నీరు కూడా ఉపయోగించుకోవడానికి వీలుగా లేకుండా మురికిగా వస్తున్నాయి. దీంతో ప్రజలు దగ్గరలోని స్వర్ణభారతినగర్‌కు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు.

సమస్యలు ఇలా..

- డ్రెయినేజ్‌ల నిర్వహణాలోపంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి సమస్యగా మారింది.
- రేషన్ సరుకులు అందించేందుకు ఎండీయూ వాహనాలు సైతం రాని పరిస్థితి.
- పారిశుధ్య పనులు చేసే సిబ్బంది కూడా నిత్యం రాకపోవడంతో టిడ్కో ప్రాంగణాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది.
- టిడ్కో గృహసముదాయాల పరిసరాలు పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిట్టడివినితలపిస్తున్నాయి. దోమలు, విషసర్పాలతో ఆందోళన చెందుతున్నారు.
- నాసిరకం విద్యుత్ వైర్లు కారణంగా ఇళ్లలో తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గుంటూరులో అయితే వైర్లు కాలిపోయిన ఘటనలు ఉన్నాయి.

సాగుకు.. యంత్ర సాయం

- జిల్లాకు రూ.2.85 కోట్లు.. 1719 పరికరాలు పంపిణీ
- రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సేద్యానికి సాంకేతిక సహకారం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రైతులకు రాయతీపై వ్యవసాయ యంత్రపరికరాలు అందించేందుకు నిధులు విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియను కూడా మొదలుపెడుతున్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. త్వరలోనే యంత్ర పరికరాలను రైతులకు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా, పారదర్శకంగా ఈ పథకాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందించే ప్రక్రియను గత వైసీపీ పాలకులు అస్తవ్యస్తం చేయగా ప్రస్తుత ప్రభుత్వం రైతులకు మేలు జరిగేలా మార్గదర్శకాలను రూపొందించింది. 2014--19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం సేద్యంలో యాంత్రీకరణను ప్రవేశపెట్టాలనే దిశగా లక్ష్యాలు రూపొందించుకుని అడుగులేసింది. ఆ తర్వాత గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త నిర్ణయాలతో ఈ పథకాన్ని అధోగతి పాల్జేసింది. అంతా కలిపి గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సేద్యానికి అవసరమయ్యే పరికరాలపై పెట్టిన ఖర్చు రూ.18 కోట్లకు మించలేదు.



నిధుల కేటాయింపు ఇలా...

బాపట్ల జిల్లాకు 1719 వ్యవసాయ పరికరాలను రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకు రూ.2.85 కోట్లు విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. గుంటూరు జిల్లాకు వచ్చేసరికి 1727 పనిముట్లకు రూ.2.91 కోట్లను ప్రభుత్వం కేటాయించగా, పల్నాడు జిల్లాకు రూ.2.80 కోట్లు ఖర్చు చేసి 1715 పరికాలను రైతులకు అందించే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాయితీపై అందించే పనిముట్లలో ట్రాక్టర్, డ్రోన్ ఇంప్లిమెంట్స్, స్ప్రేయర్లతో పాటు రోటావేటర్లు, పవర్ వీడర్లు ఇతరత్రా కూడా ఉన్నాయి. పరికరాలు కావాలనుకునే రైతులు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని ఆయా మండలాల పరిధిలోని వ్యవసాయ సిబ్బంది ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేసి, క్షేత్రస్థాయిలో దరఖాస్తు చేసుకున్న రైతుల అర్హతలపై వివరాలు సేకరించి అర్హుల జాబితాను రూపొందిస్తారు. ఆ జాబితాను జిల్లా స్థాయిలో నివేదించి తర్వాత తుది ప్రక్రియ దిశగా అడుగులేయనున్నారు. ఈ మొత్తం ప్రక్రియను రెండు వారాల్లోగానే పూర్తి చేసి లబ్ధిదారులకు పరికరాలు అందించాలనే లక్ష్యంతో అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తే..

ప్రభుత్వం బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు యంత్రపరికరాలను రాయితీకి అందించేందుకు రూ.8.56 కోట్లు విడుదల చేసింది. దరఖాస్తుల ప్రక్రియ ముగిసేసరికి మార్గదర్శకాలలో తెలిపిన పనిముట్లలో వేటికి ఎక్కువ మంది రైతులు ఆశ చూపితే వాటి కేటాయింపుల విషయంలో స్వల్ప మార్పుల ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లాల వారీగా అందించే పనిముట్ల సంఖ్యను కూడా ప్రభుత్వం ప్రకటించింది. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 25,000 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వానికి మళ్లీ ప్రతిపాదనలు పంపి మలిదశ నిధులు కూడా దక్కేలా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అభివృద్ధి పనులకు.. రూ.25.65 కోట్లు

- న్యూగుంటూరు స్టేషన్‌లో సిగ్నలింగ్, టెలికం వర్కులు
- వేమూరులో గూడ్స్ షెడ్, కృష్ణాకెనాల్-మంగళగిరి మధ్య పైపులైను

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు రైల్వే శాఖ టెండర్లు పిలిచింది. ఆయా పనులకు రూ.25.65 కోట్లు కేటాయించగా త్వరలోనే ప్రారంభించబోతుంది. వేమూరు రైల్వేస్టేషన్‌లో గూడ్స్‌షెడ్డు ఏర్పాటు కానున్నది. న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలకు తలెత్తుతున్న ప్రతిబంధకాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ అభివృద్ధి చేయనున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కృష్ణాకెనాల్ - గుంటూరు వాటర్ పైపులైను పనులు ఎట్టకేలకు పట్టాలెక్కనున్నాయి. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర ప్రాంతాల్లోని రైతులకు వారి పంట ఉత్పత్తులు రవాణాకు సరైన సదుపాయాలు లేవు. తెనాలి రైల్వేస్టేషన్‌కు/రోడ్డు మార్గంలో రవాణా చేసుకోవాల్సి వస్తున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు గుంటూరు రావాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రైల్వే శాఖ వేమూరు క్రాసింగ్ రైల్వేస్టేషన్‌లో ఒక గూడ్స్ షెడ్డుని అభివృద్ధి చేయాలని నిర్ణయించి రూ.9.98 కోట్ల కేటాయించింది. కృష్ణానది నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ వరకు పదేళ్ల క్రితమే మంజూరైన తాగునీటి పైపులైను పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో కృష్ణానది వంతెనపై ఓపెన్ వెబ్ గర్డర్ నిర్మాణానికి రూ.2.97 కోట్లు మంజూరు చేయడంతో రైల్వే శాఖ టెండర్లను పిలిచింది. గుంటూరు - న్యూగుంటూరు/రెడ్డిపాలెం మధ్య టవర్ కార్ రాకపోకలకు, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్డు 4, 5 లైన్ల నుంచి తెనాలి వైపునకు గూడ్స్ రైళ్ల రాకపోకలకు వీలుగా అవసరమైన సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ చేపట్టడానికి రూ.12.7 కోట్ల అంచనాతో టెండర్ల ప్రక్రియని రైల్వే శాఖ చేపట్టింది.

ధాన్యం సేకరణ.. నేటితో ముగింపు

- 91,560 టన్నుల ధాన్యం మద్దతుధరకు కొనుగోలు
- రూ.212 కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ
- రబీ సీజన్ కొనుగోళ్లకు సన్నద్ధమవుతున్న యంత్రాంగం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల ఘట్టం నేటితో ముగుస్తోంది. ఖరీఫ్ సీజన్ లో మొత్తం 91,560 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించారు. 14,259 మంది రైతులకు మద్దతు ధర ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూర్చగా రూ.212 కోట్లను రైతాంగం ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ సారి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే అన్న దాతల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా అన్ని చర్యలు చేపట్టింది. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు శనివారంతో ముగుస్తుండడంతో రబీ సీజన్‌పై యంత్రాంగం దృష్టి సారించింది. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు తెరిచే విధంగా సన్నాహాలను అధికారులు ప్రారంభించారు

రబీ సీజన్ ప్రతిపాదనలు భారీగానే...

ఖరీఫ్ సీజన్‌కు గాను ప్రభుత్వం తొలుత ఇచ్చిన 50,000 టన్నుల లక్ష్యం సరిపోక పలు దఫాలుగా ప్రతిపాదనలు పంపి ఆమోదం తెచ్చుకోవడం కోసం శ్రమించాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. రబీ సీజన్‌లో అలాంటి పరిస్థితి ఉత్పన్నమవకుండా పెద్ద ఎత్తున దిగుబడులు వచ్చే అవకాశం ఉండడంతో మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల ప్రతిపాదనలను లక్ష టన్నుల వరకు పంపనున్నారు. రబీసీజన్ విషయంలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లతో సిద్ధమవుతున్నామని ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నామని సివిల్ సప్లయిస్ విభాగం చెబుతోంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (శనివారం)

సహరి : 4.59 (ఆదివారం)

అట్టహాసంగా.. శింగరకొండ తిరునాళ్ల

- వైభవంగా రథోత్సవం.. తరలివచ్చిన భక్తులు
- సందిరెడ్డి మిత్రమండలి ఆధ్వర్యంలో 25వ ఏట ప్రభ



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి 70వ వార్షిక తిరునాళ్లు శుక్రవారం వైభవంగా ముగిశాయి. బుధవారం ఉత్సవాలు ప్రారంభం కాగా చివరి రోజు శుక్రవారం ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరశింహస్వామి దేవాలయాలతో పాటు శింగరకొండ క్షేత్రం విద్యుత్ దీపాల వెలుగులతో నిండిపోయింది. భక్తులు స్వామి వార్ల దర్శనానికి పోటెత్తారు. క్యూలు భక్తులతో కిటకిట లాడాయి. శుక్రవారం రాత్రి జరిగిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవాన్ని తిలకించారు.

తిరునాళ్లకు ఐదు ప్రభలు..

శింగరకొండ తిరునాళ్లకు 5 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ప్రభలపై వెలుగులు ప్రత్యేక ఆకర్షణ గా ఉన్నాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు. శింగరకొండపాలేనికి చెందిన టీడీపీ నేతలు రెండు, అద్దంకి పట్టణం నుంచి ఒక ప్రభను ఏర్పాటు చేశారు. టీడీపీ నేత సందిరెడ్డి రమేష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో 25వ ఏట ప్రభ ఏర్పాటు చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలతో ఆ ప్రాంతం పసుపు మయంగా మారింది. భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) ప్రభను ఆ పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ సందర్శించి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. వైసీపీ నేతలు ప్రభలు ఏర్పాటు చేయకుండా ముఖం చాటేయడంతో ఆపార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారు.



విద్యుత్ వెలుగులలో శింగరకొండ క్షేత్రం



జనషోన

పవనుడు అందరివాడు..

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..

పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పింఛన్ల బదిలీకి ఛాన్స్!

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల బదిలీకి అవకాశమిచ్చిన ప్రభుత్వం
● సచివాలయాల్లో బదిలీ దరఖాస్తు చేసుకునే సదుపాయం

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వలంటీర్లు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులే ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించడంతో మొదలైన ఈ సంస్కరణల ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రతినెలా ఏదో ఒక సంస్కరణతో పింఛనుదారుల్లో భరోసాపెంచేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తాజాగా పింఛన్లను తమకు నచ్చినచోటికి మార్చుకునేలా అవకాశం కల్పించింది. దీంతో ఈ అవకాశంకోసం ఎదురుచూస్తున్న ఎంతోమంది పింఛనుదారులకు ఊరట లభించినట్లయింది.

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 7లక్షల 53వేల 830మంది పింఛన్లు పొందుతున్నారు. వారిలో చాలామంది గతంలో తాము ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం నివసించడం లేదు. వయోవృద్ధులు బిడ్డల పై ఆధారపడి వేరేచోటకి వెళ్లిపోవడం, చూసేవా రులేక ఆశ్రమాల్లో ఆశ్రయం పొందడం, ఒంటరి మహిళలు, వితంతువులు బతుకుదెరువు కోసం ఒకచోటి నుంచి మరోచోటికి వెళ్లాల్సిరావడం వంటి పలు కారణాలతో వేరే ప్రాంతాలకు వెళ్లినవారు చెప్పుకోదగిన సంఖ్యలోనే ఉన్నారు. వీరంతా పింఛన్లను బదిలీ చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సమీపంలోని సచివాలయాలకు వెళ్లి నిరాశగా వెనుతిరుగుతున్నారు. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో ఇప్పటి వరకూ ఫ్రీజింగ్‌లో ఉన్న పింఛన్ బదిలీ ఆప్షన్ అనేబుల్ చేసింది. దీంతో పింఛన్ల బదిలీకి అవకాశం లభించింది. పింఛన్ల బదిలీ కోరుకునే లబ్ధిదారులు ప్రస్తుతం వారు నివసిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ల బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెలాఖరు నాటికీ ఈ ప్రక్రియను పూర్తిచేసుకుంటే ఏప్రిల్ 1నుంచి లబ్ధిదారులు ఉండేచోటికే పింఛన్లు తెచ్చి అందిస్తారు.

కొత్త పింఛన్లపై నిరాశే..

కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛను మొత్తం పెరగడంతో అనేక మంది కొత్తగా పింఛన్లు పెట్టుకోవాలని భావిస్తున్నారు. గత వైసీపీ సర్కారు కక్షాపూరిత రాజకీయాల వల్ల కూడా అనేకమంది పింఛనుదారులు అనర్హత బారిన పడ్డారు. వారంతా గత ఎనిమిది నెలలుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్లకు అవకాశం కల్పించాలని అలాంటివారంతా ప్రజాప్రతినిధుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి ఎమ్మెల్యేకి వచ్చే విజ్ఞప్తుల్లో 70 శాతం పింఛనుకు సంబంధించిన విజ్ఞప్తులే ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతా వారంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

పిన్నెల్లిపై.. చర్చకు సిద్ధమా..?

● జగన్మోహనరెడ్డికి యరపతినేని పిలుపు



పిడుగురాళ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గురజాల నియోజకవర్గంలోని పిన్నెల్లి, మోర్జంపాడుతో పాటు పలుగ్రామాలలో టీడీపీ శ్రేణులపై దాడులు, అక్రమ కేసులు, ఆస్తుల ధ్వంసంపై పిన్నెల్లి గ్రామం వేదికగా చర్చకు రావాలని పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆహ్వానించారు. గత ఐదేళ్ల అనేక గ్రామాలలో అరాచకాలకు పాల్పడి మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టిన వైసీపీ నేతలు కొందరు జగన్‌ను కలిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాపై దాడులు జరుగుతున్నాయని, ఊర్ల నుండి వెలివేస్తున్నారని చెప్పడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని యరపతినేని పేర్కొన్నారు. జగన్‌కు వైసీపీ నేతలు చెప్పిన మాటల్లో వాస్తవం లేదని, అన్నివిషయాలు వెలుగులోకి రావాలంటే జగనే పిన్నెల్లికి రావాలని యరపతినేని పిలుపునిచ్చారు. జగన్ ఎప్పుడు వచ్చినా చర్చకు సిద్ధంగా ఉన్నానని, జగన్ హాజరై ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన అకృత్యాలు, అక్రమాలపై అక్కడే సమాధానం చెప్పాలని యరపతినేని డిమాండ్ చేశారు. 2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు ఒక్క వైసీపీ కార్యకర్త కూడా గురజాల నియోజకవర్గంలో చనిపోలేదని, 2019-24 మధ్య వైసీపీ అధికారంలో వుండగా 11 మంది తెలుగుదేశం కార్యకర్తలు హత్యకు గురికావడమే కాకుండా వైసీపీ నేతలు అక్రమమైనింగ్ చేస్తున్న గుంతల్లో పడి 8 మంది చిన్నారులు మృతి చెందిన విషయమే కాకుండా వైసీపీ నేతలు మహిళలపైచేసిన అత్యాచారాలు, ఆక్రమించుకున్న భూములతో బ్యాంక్‌ల రుణాలు, విచ్చలవిడిగా గ్రామాలలో తెలంగాణ మద్యం అమ్మకాలు, పిన్నెల్లి, తంగెడ గ్రామాలలో నాటు బాంబుల తయారీ విషయాలపై జగన్‌తో చర్చావేదిక జరిపేందుకు సిద్ధంగా వున్నానని, వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాల విషయాలను బయట ప్రపంచానికి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కృష్ణానది గర్భాన్ని కూడా వదలకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడటమే కాకుండా తుమ్మలచెరువు, పెదగార్లపాడు, గుత్తికొండలో మైనర్ బాలికలపై అఘాయిత్యాలు, పిడుగురాళ్లలో బీసీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యం, తుమ్మలచెరువు సైదాపై జరిపిన దాడిపై చర్చకు జగన్ సిద్ధమేనా అని ప్రశ్నించారు. జగన్ పిన్నెల్లి ఎప్పుడు వచ్చినా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన నిర్వాకం, అక్రమాలు చర్చా వేదికలో బయటపెడతామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దాడులను ప్రోత్సహించలేదని, నాయకులను, కార్యకర్తలను కూడా సంయమనం పాటించాలని సూచించడం జరిగిందన్నారు.త్వరలో పిన్నెల్లిలోని అఘాయిత్యాలపై విచారణ జరిపిస్తామన్నారు. ఎన్నికల రోజున తంగెడ, పిన్నెల్లిలో బాంబుల ఘటనపై కూడా విచారణ జరిపేలా చూస్తామని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

గుండెపోటుతో జర్మనీలో గణపవరం యువకుడు మృతి



అశోక్‌చంద్రకుమార్ (ఫైల్‌ఫోటో)

నాదెండ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన కాట్రు అశోక్‌చంద్ర కుమార్ (46) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జర్మనీ దేశంలో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వెంకట చలపతిరావు కుమారుడైన అశోక్‌చంద్ర కుమార్ లండన్‌లో మైక్రోబయాలజీలో పీజీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పొన్నూరు సమీపంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన శిరీషను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కంపెనీ తరపున కొద్దికాలం క్రితం జర్మనీ వెళ్ళిన ఆయన ఈనెల 7వ తేదీన ఉద్యోగానికి వెళ్తుండగా కార్డియాక్ అరెస్టుకు గురయ్యాడు. స్నేహితులు అతన్ని ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహం శనివారం ఉదయానికి గణపవరం రానున్నది. ఆయన మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

గుంటూరు కెనాల్‌లో కాలు జారిపడి విద్యార్థి మృతి



దాసరి జాషువా (ఫైల్‌ఫోటో)

పెదకాకాని, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలుజారి గుంటూరు చానల్‌లో పడి విద్యార్థి మృతిచెందిన సంఘటన శుక్రవారం నంబూరులో జరిగింది. అదే గ్రామానికి చెందిన దాసరి జాషువా(13) స్థానిక జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి రంగులు పూసుకొని ఆటలాడారు. ఒంటిపై రంగును కడుక్కునేందుకు స్నేహితులతో కలిసి గుంటూరు చానల్ వద్దకు వచ్చాడు. రంగులు కడుక్కుంటున్న క్రమంలో కాలుజారి చానల్‌లో పడిపోయాడు. వెంటనే పక్కనున్న పిల్లలు స్థానికులకు సమాచారం ఇవ్వగా గుంటూరు చానల్ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు.

16, 17 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈ నెల 16, 17 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 08579 విశాఖపట్టణం-చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6.20కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా రాత్రి 10 గంటలకు విశాఖపట్టణం చేరు కొంటుందన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్రవారం నాటికి 520.30 అడుగులు ఉంది. ఇది 149.82 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,761 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

గుండెపోటుతో రైతు మృతి

కారంపూడి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన రైతు బొజ్జ వెంకటేశ్వర్లు (69) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామ శివారులోని నాలుగు ఎకరాల భూమిని గత మూడు తరాలుగా సాగు చేస్తున్నారు. ఇటీవల ఆ భూమిలో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. వందల యేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో ప్రభుత్వ అధికారులు బోర్డు పెట్టడంతో గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. తాము సాగు చేసుకుంటున్న భూమికి తమకే పట్టాలివ్వాలంటూ వినతిపత్రం అందించారు. ఇంతలో కొందరు ఆ భూమిని దేవదాయ శాఖలో కలుపుకోవాలని అధికార యంత్రాంగానికి సిఫార్సులు అందిస్తున్నారు. గ్రామంలో రాజకీయ ఒత్తిడి పెరిగిపోతోంది. తరతరాల నుంచి వస్తున్న సాగుభూమి పోతుందేమోనని, జీవనం కష్టతరమవుతుందనే ఆలోచనతో గత నాలుగు రోజుల నుంచి దిగులుతో ఉన్న వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు వెంకటేశ్వర్లుకు నలుగురు సంతానం ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

మహిళల భద్రతకు రక్షణ కవచం 'శక్తి యాప్' : ఎస్పీ


ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతకు రక్షణ కవచంగా రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్‌ను తీసుకొచ్చినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కోసం ఈ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, ఇతర హింసాత్మక ఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి మహిళ, విద్యార్థిని వారి ఫోన్‌లో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న మహిళలు యాప్‌లో ఉన్న ఎస్‌వోఎస్ బటన్‌పై ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీసుస్టేషన్‌కు డయల్ 112 నెంబర్‌కు చేరుతుందన్నారు. తద్వారా వెంటనే పోలీసు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించేవిధంగా చర్యలు చేపట్టటం జరుగుతుందన్నారు. గూగుల్ ప్లేస్టోర్ ద్వారా శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో సంప్రదించవల్సిన నెంబర్లను జోడించాలన్నారు. జిల్లాలో శక్తి బృందాలను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఒక్కొక్క బృందంలో ఆరుగురు సభ్యులు ఉంటారని చెప్పారు. ప్రతి బృందానికి ఒక ఎస్ఐ ఇన్‌చార్జిగా ఉంటారన్నారు. ప్రస్తుతం జిల్లాలోని రేపల్లె, చీరాల, బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో మూడు బృందాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

పిఠాపురం తరలివెళ్లిన జనసేన నాయకులు


ప్రదర్శనగా బయలుదేరిన జనసేన నాయకులు విన్నకోట సురేష్, గుంటుపల్లి తులసీకుమారి తదితరులు

బాపట్ల, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టిన సభకు బాపట్ల నుంచి జనసేననాయకులు పెద్దఎత్తున తరలి వెళ్లారు. సూర్యలంకరోడ్డులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పవన్‌కళ్యాణ్ పేరిట జనసేన నాయకులు, ఆఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ఫ్లెకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాలుగు బస్సులు, 40 కార్లల్లో ప్రదర్శనగా తరలి వెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనహృదయాలలో ఉద్భవించిన జనసేనపార్టీతో ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సురేంద్ర, కారుమూరి అంజనేష్, మాడసాని బాలాజి, దాసరి వినోద్, తిరుమలశెట్టి సాగర్, టీడీపీ నాయకులు భీమా కోటేశ్వరరావు, కామిశెట్టిసాయి, పెద్దినాగు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని 14వ వార్డులో నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆధ్వర్యంలో కేఆర్‌కే నాయుడు, చల్లా శ్రీనివాసరావు, కొక్కిరాల రాజేంద్ర, కంచర్లపల్లి కిషోర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిడుగు విజయమాధురి, మాధవి, షేక్ కరీముల్లా, గంటా నాగమల్లేశ్వరరావు, బడే అంకమ్మరావు, బెజ్జం బాబురావు, సాయితేజ, క్రీస్తుబాబు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని 20 పంచాయతీలలో జనసేన పార్టీ వ్యవస్థాపకుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఊరూరా జనసైనికులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చింతాయపాలెం, గణపవరం, నల్లమోతువారిపాలెం, దమ్మనవారిపాలెం, యాజలి, పేరలి, కర్లపాలెం గ్రామాలలో జనసైనికుల వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమాలు అనంతరం జనసైనికులందరూ మండలం నుంచి పలు వాహనాలలో అధిక సంఖ్యలో పిఠాపురం జనసేన ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పెదమల్లు వెంకటేశ్వరరావు, వెంకటపతిరావు, ఏనుగు వెంకయ్య, చిన్న, రౌతు అన్నమయ్య, సూరిసేని మురళికృష్ణ , మాడా బుజ్జిబాబు, మాడా శ్రీనివాసరావు, గరిగంటి లక్ష్మీనారాయణ, సాయిని రాంబాబు, తాండ్ర రాధాకృష్ణమూర్తి, మునిపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

చింతాయపాలెంలో ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతాయపాలెంలో ఉన్న శ్రీ గోపయ్య స్వామి శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి తిరునాళ్ల వేడుకలు అంబరాన్ని అంటాయి. ఆలయానికి ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేశారు. ఆలయం ముందు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. అమ్మవారికి పసుపుబండ్లను తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పసుపుకుంకుమను అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని శీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామివార్లకు విశేష పూజలను, అభిషేకాలను, ప్రత్యేకహోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను గ్రామ సర్పంచ్ పితా శ్రీనివాసరావు, ఆలయ పెద్దలు పెదమల్లు సుబ్బారావు, ఏనుగు వెంకయ్య, తన్నీరు కృష్ణమూర్తి, తోట నాగేశ్వరరావు, రౌతు మల్లికార్జునరావు, పెదమల్లు మార్కండేయులు, పెదమల్లు గంగరాజు, తోట రామకృష్ణ తదితర గ్రామపెద్దలు వేడుకలను పర్యవేక్షించారు.

జంపనిలో...

వేమూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం వార్షిక తిరునాళ్ల కార్యక్రమంలో భాగంగా అమ్మవారి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉన్న విగ్రహాలను సుందరంగా అలంకరించారు. భజన సమాజాల వారు భజన కీర్తనలు ఆలపించారు. గ్రామోత్సవం జరిపి భక్తుల సహకారంతో అన్నదానం చేశారు.

శ్రీ చెన్నకేశవస్వామి గరుడ వాహనోత్సవం

పిట్టలవానిపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు గరుడ వాహనోత్సవం, సాయంత్రం నిత్యహోమాలు, బలిహారం, రాత్రి 7 గంటలకు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదుట భక్తసమాజం రాజోలువారిచే భజన కాలక్షేపం ఆర్గనైజర్ యెండూరి మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీస్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు

పిట్టలవానిపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ లక్ష్మీ జయంతి సందర్భంగా శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి, శ్రీలక్ష్మీ నరసింహస్వామివారికి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంవీఎస్ వర్మ తెలిపారు. ఆలయ అర్చకులు వేదాంతం శరత్ చంద్రబాబు, వేదాంతం మురళి మోహన్, వేదాంతం రఘుకుమార్, వేదాంతం శ్రీనివాస్‌లు స్వామికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా అయ్యప్పస్వామి పుట్టినరోజు వేడుకలు

బాపట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీసోమేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీఅయ్యప్పస్వామి జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కొటికం సుబ్బారావు మాట్లాడుతూ హరిహర సుతుడు అయ్యప్పస్వామి జన్మదినాన్ని జరుపుకోవటం ఎంతో ఆనందదాయకమన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన గురుస్వాములు బి.బాబునాగేంద్ర, సుబ్బారావు, మల్లెల కోటేశ్వరరావు, మోహనరావు, శంకర్, పరమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు తదితరులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కోలాటం పద్మను కూడా సన్మానించారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐసీడీఎస్ పీడీగా రాధా మాధవి

బాపట్ల, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా డి.రాధామాధవి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన ఇన్‌చార్జి పీడీ కె.ఉమా ఫిబ్రవరి నెలలో ఉద్యోగవిరమణ చేయటంతో అప్పటి నుంచి విద్యాశాఖలో పనిచేస్తున్న నాగిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం డి.రాధామాధవిని నియమించటంతో ఆమె బాధ్యతలు చేపట్టారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ అందజేత

కర్లపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు యాక్షన్ టవర్స్ అధినేత హైదరాబాద్ వలి శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. వాహనడ్రైవర్లు ముగ్గురుకి, సూపర్‌వైజర్‌కి, నిరుపేద మహిళలకు దుస్తులు అందజేశారు.

మున్సిపల్ హైస్కూల్ నిర్మాణ పనులకు నిధులు విడుదల

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోటి 40 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 7న బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విచ్చేసి పాఠశాల స్థితిగతులను పరిశీలించి అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారన్నారు. ప్రకటించిన ప్రకారం నిధులు మంజూరు చేసి పాఠశాల కమిటీ ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం రోజు కొత్త యూనిఫామ్‌లో నూతన భవనంలో విద్యార్థులు విద్యాబుద్దులు నేర్చుకుంటారని చెప్పారు.

వార్డు, గ్రామాలలో విజిట్ చేసి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి నెల ఏరియా వైద్యశాల కమిటీ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. వంద పడకల ఆసుపత్రిగా ఉన్న ఏరియా వైద్యశాలను 300 పడకల ఆసుపత్రిగా చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. త్వరలో ఇది కార్యరూపం దాలుస్తుందన్నారు. ముఖ్యంగా బాపట్లకి రెండో సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ ఏర్పాటు చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. బాపట్లను ప్లాస్టిక్ రహిత పట్టణంగా చేయటానికి ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఫుట్‌పాత్‌ల మీద ఉన్న దుకాణాలు తొలిగించటానికి చర్యలు చేపట్టామన్నారు. మున్సిపాలిటి పరిధిలో గతప్రభుత్వ హయాంలో పనులు చేసి డబ్బులు రాని కాంట్రాక్టర్‌లకు 5 లక్షల లోపు బిల్లులు మొత్తం చెల్లించే ఏర్పాటు చేశామన్నారు. లక్ష రూపాయల బిల్లులు ఇప్పటికే చెల్లించటం జరిగిందన్నారు. మున్సిపాలిటి ఎన్నికలు జరిపేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్నికలు జరిగితే 15వ ఆర్థిక సంఘ నిధులు, 16వ ఆర్థిక సంఘ నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 20 కోట్ల 50 లక్షల రూపాయలు ఖాతాలో ఉన్నాయని, వస్తే ఎన్టీఆర్ పీఎం కాలనీలలో ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు నిర్మించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. పట్టణ నడిబొడ్డున విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి లోవోల్టేజి సమస్య పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో 630 పనులకు సంబంధించి ప్రతిపాదనలు చేయటం జరిగిందని ఎమ్మెల్యే వేగేశన తెలిపారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన పనులన్ని చేస్తామన్నారు. ముత్తాయపాలెం నుంచి కప్పలవారిపాలెం వెళ్లే దారిలో నల్లమడ డ్రైన్‌పై బ్రిడ్జి నిర్మించి రెండు మండలాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. పట్టణంలో పెరిగిపోయిన చెత్త నిల్వలను జిందాల్‌కు పంపిస్తున్నామన్నారు. డంపింగ్ యార్డు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. ముఖ్యంగా పర్యాటక కేంద్రానికి నూతన హంగులు తీసుకొచ్చి అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు వై.భూపతిరావు, మాజీ అధ్యక్షులు నక్కల వెంకటస్వామి, సీనియర్‌నాయకులు మందపాటి అంద్రేయ, షేక్.బాజి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. పట్టణంలో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించటంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. అనంతరం బాపట్లలోని దగ్గుమల్లివారిపాలేనికి చెందిన దాసరి మురళికి రూ.1,01,707ల చెక్కు, రైలుపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలికి రూ.74,398, ఇమ్మడిశెట్టివారిపాలేనికి చెందిన ఇమ్మడిశెట్టి మురళికృష్ణకు రూ.56,365, చిల్లర గొల్లపాలేనికి చెందిన ఆవుల వెంకటేశ్వర్లుకు రూ.45 వేలు, అన్నవరం మాధవరావుకు రూ.42 వేలు, జి.హరిప్రకాష్‌కు రూ.18వేల చొప్పున మొత్తం రూ.3,37,470ల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ, ఊట్ల రామారావు, కూచిపూడి శ్యామ్ సుందర్, బూర్లె రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కేఎల్ఎన్ రెడ్డి

నూతన పారిశ్రామిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● ఎంఎస్ ఎంఈ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ఎన్ రెడ్డి

బాపట్ల, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : నూతన పారిశ్రామిక విధానాలపై అవగాహన కలిగి ఉండి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను, సహకారాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించవచ్చని ఎంఎస్ ఎంఈ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం లీన్ ట్రైనింగ్ క్యాంప్‌నకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులను, వాటిపై అవలంభించిన విధానాలపై అవగాహన కల్పించారు. ట్రైనర్‌గా విచ్చేసిన ఇండస్ట్రీయల్ సైకాలజిస్ట్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు తక్కువ పెట్టుబడి వ్యయంతో ఆదునీక టెక్నాలజి ఉపయోగించి నాణ్యతతో కూడిన ఉత్పత్తి సామార్ధ్యాన్ని పెంచి అధిక లాభాలను రాబట్టటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. వైజాగ్ నుంచి విచ్చేసిన లీన్‌ట్రైనర్ పి.మార్టిన్, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలు నుంచి పొంద వలిసిన రాయితీలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.వీరయ్య, బాపట్ల జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి వెంకటరత్నగుప్తా, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలి : సీపీఐ

బాపట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా రైతుల శ్రమని కార్పొరేట్ వ్యాపారవర్గాలు దోచుకుంటున్నాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. శ్రమజీవులతో కలిసి కార్ల్ మార్క్స్ 142వ వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసి పార్టీ ఆధ్వర్యంలో డ్రైవర్స్ కాలనీలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మేకల ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శ్రామిక వర్గ పక్షపాతి కార్ల్ మార్క్స్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం బాపట్ల మండల నాయకులు పి.పోలమ్మ, ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు జె.కల్పన, పి.లక్ష్మీ, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు ఎస్‌డి హాఫీజ్, వి.విజయ్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ నిధులు కార్మికుల జీతాలకు కేటాయించాలి : సీపీఎం

బాపట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్యాకేజి నిధులు కార్మికుల జీతాలకు కేటాయించాలని, సొంత గనులిచ్చి ప్రైవేటీకరణ ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజి 11,443 కోట్ల రూపాయలను కేవలం అప్పులు తీర్చుకోవటానికి ఇవ్వటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.శరత్, కె.నాగేశ్వరరావు, ఎం.బుచ్చిరాజు, బాషా, డాక్టర్ గుదే రాజారావు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

కర్లపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : దండుబాటులోని మసీదు సమీపంలో ఉన్న 16 మంది నిరుపేద మహిళలకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన చీరలను జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, షేక్ మస్తాన్‌వలి, షేక్ బహదూర్‌బాషా, షేక్ ఇబ్రహీం, పఠాన్, షేక్ జిలానీ, షేక్ జానీబాషా, షేక్ గఫూర్, షేక్ హబీబ్ పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్ కోరారు. భట్టిప్రోలులోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తుందన్నారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేకపోవడం వల్ల మురుగు కాల్వల్లో పూడికలు తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్, కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, మనోజ్‌కుమార్, బేతాళ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ప్రజలు అర్హత పొందాలి : సాయిబాబా


భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజలు అర్హత పొందేందుకు సచివాలయ సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా శుక్రవారం తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఉగాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పథకాలకు అర్హత పొందాలంటే గ్రామ సచివాలయాలకు వెళ్లి ప్రభుత్వ సర్వేలో కుటుంబం మొత్తం మ్యాపింగ్ చేయించుకుంటే పింఛన్, రేషన్, నివేశన స్థలాలు, వ్యవసాయ, డ్వాక్రా సంఘాల ద్వారా పొందే రాయితీలకు వీలు కలుగుతుందన్నారు. ఇతర సమాచారం, సహకారం కోసం 9500331231లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి

వేమూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కైతేపల్లి షాలేంరాజు సహకారంతో మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు 50 మందికి శుక్రవారం పరీక్ష సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సంఘ సభ్యులు పచ్చిగళ్ల అనిల్, వేల్పుల రవిప్రసాద్, ఆరమళ్ల దేవరాయల్ వినయ్, ముదునూరి అరుణ్‌కుమార్, మదునూరి విజయ్ పాల్గొన్నారు. గ్రేస్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయించాలని మండల ప్రత్యేక అధికారి కె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం బీసీ, ఎస్సీ గృహ నిర్మాణదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా అందిస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలకు సున్న వడ్డీతో రూ.35 వేల రుణం మంజూరు, ఉచిత ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, హౌసింగ్ ఏఈ సౌమ్య, ఏపీవో పార్వతి, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, మండల గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్

వైభవంగా ప్రసన్నాంజేయస్వామి ఆలయ వార్షికోత్సవం

వేమూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వేమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మపురంలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపి విశేషంగా అలంకరించారు. అష్టోత్తర సహస్రనామ పూజ, విశేషంగా సింధూర అర్చన జరిపారు. వేణుకేశవ భజన సమాజం వారు హనుమాన్‌చాలీసా, భగవద్గీత విష్ణు సహస్రనామ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తర స్తోత్రం పారాయణం చేశారు. భక్తుల సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిపారు.

ఘనంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

కొల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వేణుగోపాలస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం పారువేట గ్రామోత్సవం నిర్వహించి స్వామివారిని అశ్వవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం వేళ స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తిరునాళ్లలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలను దేవదాయ శాఖ కార్య నిర్వహణాధికారి ఎన్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

శ్రీరామలింగేశ్వరస్వామి..

చుండూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చినపరిమిలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వార్ల దివ్య కళ్యాణోత్సవం, అనంతరం సాగిన రథోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు ఆలయ ప్రాంగణం రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రథంపై దేవతామూర్తులను అలంకరించారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

బాపట్ల, రేపల్లె, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 15వ తేదీ నుంచి వచ్చేనెల 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నామని డీఈవో ఎస్.పురుషోత్తం తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు బడులు నిర్వహించటం జరుగుతుందన్నారు.


ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఆళ్లమూడి గ్రామానికి చెందిన పులి జగదీష్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన సిరాం దాసు, హేమామాలిని, చింతమోటు గ్రామానికి చెందిన ఉయ్యూరు అక్షయ, పెదపులివర్రు గ్రామానికి చెందిన మల్లిపెద్ది నాగవర్ధిని, సూరేపల్లికి చెందిన వేపూరి శైలజలు పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. ఎమ్మెల్యే ఆనందబాబును సంప్రదించి ఆర్థిక సాయం అందించాలని కోరగా ఎమ్మెల్యే రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపించారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి పులి జగదీష్‌కు రూ.1,54,568, సిరాందాసు హేమమాలినికి రూ.50,524, ఉయ్యూరు అక్షయకు రూ.49,983, మల్లిపెద్ది నాగవర్ధినికి రూ.32,324, వేపూరి శైలజకు రూ.23920 చెక్కులు రాగా వాటిని ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబులకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

సారా రహిత దిండిపంచాయతీగా తీర్చిదిద్దుదాం


గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రేపల్లె, మార్చి14(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో ఎక్కడా నాటుసారా దొరికిన దిండిపంచాయతీలోనే మూలాలు వస్తున్నాయని నాటుసారా తయారీని మానుకోకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. నిజాంపట్నం మండలం పరిశావారిపాలెంలో నాటుసారా నియంత్రణపై పంచాయతీలోని ప్రజలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దిండి పంచాయతీలో ఎవరైన నాటుసారా తయారు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మన గ్రామాన్ని సారారహిత గ్రామంగా మార్చుకుందామని వారితో ప్రతిజ్ఞచేయించారు. 25 మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేయించామని తెలిపారు. సారా తయారీ, రవాణా, అమ్మకం, ముడిపదార్థాల అమ్మకం గురించి మీకు తెలిసిన సమాచారం వాట్సాప్ నెంబర్‌లైన 94904 55599, 94409 02477లకు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో నగరం ఎక్సైజ్ సీఐ మాటూరి శివరామ్‌ప్రసాద్, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలు రామారావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలి

చుండూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అల్పాదాయ వర్గాలకు గత ప్రభుత్వంలో మంజూరై నిర్మాణాలు నిలిచిపోయిన గృహాలకు పూర్తిగా ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారిణి జెన్నిమ్మ కోరారు. మండల కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వాటి వివరాలను వెల్లడించారు. బీసీ, ఎస్సీ వర్గాల వారికి రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, చేనేత వర్గాల వారికి రూ.లక్ష వరకు అదనపు రుణాలు అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత మెరుగుపరిచేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుదీప, మండల పరిపాలన అధికారి సుధారాణి, మండల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత ప్రమాణాలు పూర్తి స్థాయిలో మెరుగుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మండలంలోని దుండిపాలెంలో శనివారం ఉదయం 9 గంటలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభించనున్నారు. అందరూ భాగస్వాములుకావాలని నాయకులు కోరారు.

పురపాలక సంఘ ఆశీలు వాయిదా

రేపల్లె, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన కూరగాయల మార్కెట్ రోడ్డు మార్జిన్ కబేళ, విక్టోరియా సత్రం కింద మూడు పొలాల మార్కెట్ ఆశీలు మొదలైనవి ఈనెల 17న పురపాలక సంఘంలో బహిరంగ వేలం నిర్వహణకు అధికారులు గతంలో ఆదేశాలు జారీ చేశారని పరిపాలన పరమైన కారణాల వలన ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆదేశాల మేరకు వాయిదా వేయటమైందని కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు.

గుళ్ళపల్లిలో నూతన చేనేత సహకార సంఘ కార్యాలయం ప్రారంభం

చెరుకుపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గుళ్ళపల్లిలోని భావనా రుషిస్వామి ఆలయం వద్ద నూతన చేనేత సహకారసంఘం కార్యాలయాన్ని బాపట్ల జిల్లా ఏడీ నాగమల్లేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంఘం ద్వారా చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీయ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి దివి రాంబాబు, టీడీపీ నాయకులు వంగరు చక్రవర్తి, గుళ్ళపల్లి చేనేత సంఘం అధ్యక్షుడు బ్రహ్మం, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నగరం మండల బీజేపీ అధ్యక్షుడిపై వైసీపీ నాయకుల దాడి


గాయాలపాలైన సురేష్

నగరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దారి కాచి వైసీపీ నాయకులు తనపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని నగరం మండలం బీజేపీ అధ్యక్షుడు జుజ్జవరపు సురేష్ తెలిపారు. బోరమాదిగపల్లిలోని అప్పర్ ప్రైమరీ స్కూల్లోని స్వీపర్ పోస్టు గత ప్రభుత్వంలో వ్యక్తిని తొలగించినందుకే ఈ దాడి చేశారని వారు ఆరోపించారు. వైసీపీ నాయకులైన బోరమాదిగపల్లి గ్రామానికి చెందిన చందోలు వీరయ్య, చందోలు బంగారుబాబు, నున్నపాముల ఉదయ్‌కిరణ్ మరో ముగ్గురు వ్యక్తులు తన నుదుటిభాగంలో మెడపైన తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. ప్రస్తుతం ఆయన రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దీనిపై ఎస్ఐ బండ్లభాస్కర్ మాట్లాడుతూ ఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించామన్నారు. ఈ ఘటనపై ఆరుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. బోరమాదిగపల్లి గ్రామానికి చెందిన చందోలు వీరయ్య, చందోలు బంగారుబాబు, నున్నపాముల ఉదయ్‌కిరణ్ ఇంకా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అందులో ఉన్నారని ఆయన అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి వసంతోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలులోని మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేక వాహనంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి యువకులు వసంతోత్సవం జరిపారు. భట్టిప్రోలు, అద్దేపల్లి పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. రాత్రివేళ సహస్ర దివిటీల కార్యక్రమం నిర్వహించారు. రెండు వేల మందికి సమారాధన కార్యక్రమాన్ని పద్మశాలీయ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. ధ్వజావరోహణ కార్యక్రమం అనంతరం పేటేరు వారితో భక్త చింతామణి నాటకాన్ని ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ ట్రస్టీలు కొడాలి లక్ష్మీకాంతరావు, రామశాస్త్రి, పానకాలరావు, శంకరరావు, కార్య నిర్వహణాధికారి కుమార్‌బాబు, అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహోత్తమ సంఘం సభ్యులు పర్యవేక్షించారు.




విద్యార్థికి పాఠశాల స్థాయిలో అత్యంత కీలకమైన దశ పదవ తరగతి. ఈ పరీక్షల్లో సాధించే మార్కుల ఆధారంగానే భవిష్యత్తులో ఉన్నత విద్యా అవకాశాలకు బీజం పడుతుంది. ఈ నెల 17 నుంచి 31 తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులను గూర్చి జిల్లా విద్యాశాఖ విద్యార్థులకు తగు సూచనలను, సలహాలను అందిస్తోంది..

- భయం వీడితే... సగం విజయం సాధించినట్లే
- సెల్ ఫోన్లు ,టీవీలకు విరామం ఇవ్వండి
- జంక్ ఫుడ్ జోలికి వెళ్లొద్దు.. సాత్విక ఆహారమే మేలు
- పాఠ్యాంశాల నిత్య పునఃచరణ ఎంతో కీలకం
- పది విద్యార్థులకు విద్యాశాఖ సూచనలు



జయమ్ము... నిశ్చయమ్మురా..

గుంటూరు విద్య, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే విద్యాశాఖ వందరోజుల ప్రణాళికతో పాటు ఇటీవల గ్రాండ్ టెస్టులు కూడా నిర్వహించింది. ఇందులో వచ్చిన మార్కులు ఆధారంగా విద్యార్థుల్ని మరింతగా ప్రోత్సహించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఒక ప్రణాళికతో చదివితే పదిలో ఉత్తమ మార్కులు సాధించవచ్చునని డీఈఓ సీవీ రేణుక రేణుక స్పష్టం చేస్తున్నారు.

ఆరోగ్యం... ఆత్మవిశ్వాసం

పరీక్షల సమయంలో విద్యార్థి ఆరోగ్యం పటిష్టంగా ఉండటం ఎంతో ముఖ్యం. కొంతమంది విద్యార్థులు పరీక్షలు అంటేనే తీవ్రమైన ఆందోళనకు గురవుతుంటారు. అటువంటి వారిని గుర్తించి వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇప్పించేలా విద్యాశాఖ ఏర్పాటు చేసింది. మరి కొంతమంది నిద్రాహారాలు మాని పరీక్షలకు సన్నద్ధం అవుతుంటారు . ఇది ఏ మాత్రం సరైన పద్ధతి కాదని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పునఃచరణ ఉదయం నాలుగు గంటల నుంచి ప్రారంభించి 6 గంటల వరకు, సాయంత్రం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు ప్రణాళిక ప్రకారం సబ్జెక్టుల వారీగా చేసుకోవాలి. ఏకదాటిన కాకుండా కనీసం గంటకు ఒకసారి మధ్య మధ్యలో కొంత విరామం ఇస్తూ చదువుకోవాలి. రోజుకు కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్ర అవసరం.

ఆహారం విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలి. జంక్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్, మాంసాహారం జోలికి పరీక్షలు పూర్తి అయ్యేవరకు వెళ్లకపోవడం ఉత్తమం. కొబ్బరి నీళ్ల ,మజ్జిగ, గ్లూకోజ్, వేసవి లో లభించే చెరుకు రసం, బత్తాయి రసం, పుచ్చకాయలు వంటి పండ్ల రసాలు, పానీయాలు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారి నుంచి తప్పించుకోవచ్చు.

వీటిని దూరం పెట్టండి....

- విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్లు టీవీల్లో వచ్చే క్రికెట్, సినిమాలు, సీరియల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి.
- సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలి .
- ఏకాగ్రత దెబ్బతినకుండా మానసిక స్థిరత్వంతో పరీక్షలకు సన్నద్ధం అవ్వాలి.
- పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు తాము చదువుకున్న పాఠ్యాంశాల నుంచే వస్తాయనే విషయం విస్మరించకూడదు.
- అనవసరమైన విషయాలు, వివాదాల జోలికి వెళ్ళకూడదు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా తల్లిదండ్రులు సహకరించాలి.




సమర్ధంగా సన్నద్ధం ..

ఇటీవల నిర్వహించిన గ్రాండ్ టెస్ట్ మార్కులకు దీటుగా మరింత సమర్ధంగా పరీక్షలకు సన్నద్ధమైన విద్యార్థులని సిద్ధం చేస్తున్నట్లు డీఈవో సివి రేణుక తెలిపారు. విద్యార్థులు పరీక్షల భయం వీడితే సగం విజయం సాధించినట్లేనని తెలిపారు. రోజుకు కనీసం ఏడు గంటలు ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు.

- సీవీ రేణుక, డీఈవో గుంటూరు



హోలీ వేడుకల్లో యువత సందడి

హోలీ... ఆనందాల కేళి

గుంటూరు(తూర్పు), మార్చి 14(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన ఈ విజయం... నేల నలుదిక్కులా వ్యాపించిన వసంత విలాసం.. అందరి వదనాల్లో ఆనందాన్ని చిలికించింది. ఆ సంతోషమే ఏడు రంగుల ఇంద్ర ధనస్సులా విరిసి వర్ణాల వెల్లువై కళ్లలో మెరుపు.. బుగ్గల్లో ఎరుపు.. నవ్వుల్లో భావాల వర్ణాలన్ని ఉవ్వెత్తున ఎగసి ఆనందం కింతల వేళ.. హోలీ సంబరం అంబరాన్నంటింది. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిళ్లన్నీ కేలింతల్లో కరిగిపోగా.. మనసులోని బాధలన్ని రంగులలో కలిసిపోయి మధుర క్షణాలను మిగిలిచ్చింది. శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్నారులు, యువకులు, వృద్ధులు అందరూ కలిసి రంగు రబ్బా రబ్బా అంటూ చిందేశారు. పేద, ధనిక అందరూ ఏకమై హోలీ రంగేళి అంటూ ఆడిపాడారు. రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా చేసుకున్నారు.

నేడు శ్రీనివాస కల్యాణం

- వెంకటపాలెంలో ఏర్పాట్లు పూర్తి
- 27 వేల మంది తిలకించేలా ఏర్పాట్లు
- భక్తుల కోసం 300 బస్సులు



వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్

తుళ్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజధానిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వద్ద శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణానికి టీటీడీ, జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం సాయంత్రం 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఆలయ ఆవరణలో కల్యాణ వేదిక కళాత్మకంగా తీర్చిదిద్దారు. భక్తులు కూర్చునే గ్యాలరీలు సిద్ధం చేశారు. ఈ మేరకు టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వెల్లడించారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా టీటీడీ దాదాపు 300 బస్సులు ఏర్పాటు చేసింది. తుళ్లూరు, తాడేపల్లి, తాడికొండ, మంగళగిరి మండలాల ప్రజలు సులువుగా కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకునేందుకు వీలుగా బస్సులు ఏర్పాటుచేశారు. విజయవాడ నుండి వచ్చేవారి కోసం మందడంలో ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణానికి దాదాపు 4 టన్నుల పూలు, 30వేల కట్ ఫ్లవర్స్ సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి ఆకులు, కొబ్బరి తోరణాలతో సుందరంగా అలంకరించారు. శనివారం సాయంత్రం 4 గంటల నుండి 6.15 గంటలకు అన్నమాచార్య సంకీర్తనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామి వారి కల్యాణాన్ని ప్రారంభిస్తారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు శ్రీవారి లడ్డు, పసుపు, కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కల్యాణ అక్షింతలు కలిపి ఒక బ్యాగ్‌లో పంపిణీ చేయనున్నారు. శ్రీనివాస కల్యాణవేదిక ప్రాంగణం ప్రాంతంలో 5వేల ఫ్లడ్ లైట్‌లు, 25 జనరేటర్లు, 18 ఎల్ఈడీ స్క్రీన్, దశావతారాల శ్రీవేంకటేశ్వరుడు, పద్మావతి అమ్మవార్ల కటౌట్‌లు, ఆలయం పరిసరాలలో 60 తోరణాలతో పాటు, వేంకటేశ్వర ఆలయంలో విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేఈవో వీ వీరబ్రహ్మం, పలువురు జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామి వారి కల్యాణానికి పూలదండలు సిద్ధం చేస్తున్న దృశ్యం

అశ్రునయనాల మధ్య మాణిక్యవేల్ అంతిమయాత్ర

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్నుమూసిన ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులు, కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది అశ్రునయనాల మధ్య మాణిక్యవేల్ అంతిమయాత్ర సాగింది. ముందుగా అరండల్‌పేట 10/2వ లైనులోని స్వగృహం నుంచి మాణిక్యవేల్ అంతిమయాత్ర ప్రారంభమైంది. గోరంట్లలోని ఫ్యాక్టరీ వరకు అనంతరం గోరంట్ల ఫ్యాక్టరీ నుంచి అమరావతి రోడ్డు మీదుగా కొరిటెపాడు వరకు అంతిమయాత్ర సాగింది. కొరిటెపాడులోని హిందూ శ్మశానవాటికలో మాణిక్యవేల్ అంత్యక్రియలు పూర్తి చేశారు. అంతకుముందు అరండల్‌పేటలోని నివాసంలో మాణిక్యవేల్ భౌతిక కాయం వద్ద ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి (గుంటూరు పశ్చిమ), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), నక్కా ఆనందబాబు (వేమూరు) పలువురు ప్రముఖులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు.



మాణిక్యవేల్ అంతిమయాత్రకు హాజరైన కుటుంబ సభ్యులు, కంపెనీ ఉద్యోగులు

- మంగళాద్రిలో వైభవంగా రథోత్సవం
- మార్మోగిన నృసింహ, గోవింద నామస్మరణ
- రథం లాగిన మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని

జై నారసింహా



మంగళగిరి, సిటీ మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శుక్రవారం మంగళగిరి తిరునాళ్ల ఘనంగా జరిగింది. మంగళగిరి తిరునాళ్లగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీనృసింహస్వామివారి దివ్య రథోత్సవం భక్తుల జయజయ ధ్వానాల నడుమ నేత్రపర్వంగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనులతో నగరవీధులు కిక్కిరిసిపోయాయి. రథం బయలుదేరే సమయానికి పరిసర ప్రాంతాలన్నీ జనప్రవాహంతో రద్దీగా మారాయి. నృసింహుని మహారథోత్సవం ఆనవాయితీ ప్రకారం శాకున శాస్త్ర విధిని అనుసరించి నిర్వహించారు. ఆలయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉత్సవ మూర్తుల విగ్రహాలను అర్చకస్వాములు తీన్‌మార్ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి మహారథంపై అధిష్టింపజేశారు. ముం దుగా రథయాజ్ఞికులు రథాంగ హోమం నిర్వహించి అన్నపురాశిని అష్టదిక్కులకు బలిహారణ చేశారు. రథ అధిదేవతా ఆవాహనం గావించారు. గుమ్మడికాయలు, పలు రకాల అలంకరణలతో కాషాయ ధ్వజ శోభితమైన ఈ మహారథానికి ఉత్సవ కైంకర్యపరులు మాడభూషి వేదాంతాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తదితరులు టెంకాయలను కొట్టి రథోత్సవాన్ని ఆరంభించారు. అనంతరం రథయాజ్ఞికులు రథారూఢులైన శ్రీదే వీ, భూదేవీ సమేత శ్రీ నృసింహస్వామివార్లకు హారతినిచ్చి అనుజ్ఞ ఇవ్వగా భక్తులు జై నారసింహ అంటూ భక్తి పారవశ్యంతో మోకును లాగి రథాన్ని బయలుదేరతీశారు. గాలిగోపురం వద్ద గల రథశాల నుంచి మహారథం మె యిన్ బజారు మీదగా మిద్దె సెంటరు చేరుకుని తిరిగి అదే మార్గంలో రథశాల చేరింది. నృసింహుని రథోత్సవంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. జై నారసింహ, గో వింద నామస్మరణల మధ్య భక్తులతో కలిసి ఉత్సాహంగా రథం మోకును లోకేశ్ లాగారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేశ్

ప్రయోగాత్మక సాగు.. లాభాలు బాగు

- మొక్కజొన్న సాగులో ఆశించిన ఫలితాలు
- టన్ను రూ.22,500కు కొనుగోలు చేసిన సంస్థ
- ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి

కొల్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మకంగా సాగు చేసిన పాప్‌కార్న్ మొక్కజొన్న రకం సాగులో టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ ఆశించిన ఫలితాలు సాధించారు. కొల్లూరులో 40 ఎకరాల విస్తీర్ణంలో ఈ రబీలో ఆయన పాప్‌కార్న్ మొక్కజొన్న సాగును చేపట్టారు. నూజివీడు కు చెందిన సంస్థ వారు ఎకరాకు సరిపడా విత్తనాలను కేవలం రూ.వెయ్యికే అందజేశారు. 92 రోజుల కాలపరిమితి రకం కావడంతో ఆయన అధిక విస్తీర్ణంలో పాప్‌కార్న్ వేశా రు. ఇతర రకాల కాలపరిమితి 120 రోజులు ఉండటంతో పైగా పంట చేతికి వచ్చిన అనంతరం నూర్పిడి చేయగా వచ్చిన గింజలను ఆరబెట్టడం వంటి పనులు కూలీలతో చేయించాలని, పాప్‌కార్న్ రకం సాగు చేయడం వల్ల సంస్థ ప్రతినిధులు కండె గింజలు గట్టిపడిన వెంటనే కూలీలతో పంట కోయించి వారే బస్తాలకు నింపుకుని తీసుకు వెళతారని, దీనివల్ల రైతుకు ఎకరాకు రూ.4-5 వేలు ఆదా కావడంతో పాటు శ్రమ కూడా తగ్గుతుందన్నారు. టన్ను రూ.22,500కు సంస్థ వారే కొనుగోలు చేయడం రైతుకి మరింత కలిసివచ్చే విషయమన్నారు. ఈ ప్రాంతంలో తనతో పాటు మరికొంతమంది రైతులు కూడా పాప్‌కార్న్ సాగు చేపట్టారని, మూడు నుంచి మూడున్నర టన్నుల లోపే దిగుబడులు పొందారని తాను మాత్రం ఎకరాకు 4 టన్నులు పైనే దిగుబడి సాధించడం జరిగిందన్నారు. వచ్చే రబీలో పాప్‌కార్న్ రకంతో పాటు మరో నూతన మొక్కజొన్న రకాన్ని ప్రయోగాత్మకంగా సాగు చేసి అత్యధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు.



మొక్కజొన్న బస్తాలను లారీకి మారుస్తున్న కూలీలు



ప్రయోగాత్మకంగా సాగుచేసిన పాప్‌కార్న్ మొక్కజొన్న కండెలను చూపుతున్న మురళీకృష్ణ

ఇళ్లు సరే.. సౌకర్యాలు?

(3వ పేజీ తరువాయి)

వీరి గోడు పట్టించుకున్న వారే లేరు.

● చిలకలూరిపేట చెరువురోడ్డులో 52 ఎకరాల్లో టిడ్కో సముదాయంలో వసతులు లేని కారణంగా 4,612 గృహాలకు రెండువేల మంది కూడా నివాసం ఉండడం లేదు. పట్టణానికి 4 కి.మీ దూరంలో ఉండటంతో అక్కడకు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదు. మురుగు కాల్వల నిర్మాణం జరగలేదు. వీధి దీపాలు, నీటి వసతి కల్పించింది. ఆస్పత్రి, పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది పట్టణంలోనే నివాసం ఉంటున్నారు.

● సీఆర్డీఏ పరిధిలో కృష్ణయ్యపాలెంలో టిడ్కో ఇళ్లకు వెళ్లేందుకు అప్రోచ్‌రోడ్డు లేదు. కంకరతో తాత్కాలిక రోడ్డు వేసి సరిపెట్టారు. మంత్రి లోకేశ్ చొరవతో ఇక్కడ తాగునీటి సమస్య తాత్కాలికంగా తీరుతోంది. దొండపాడులో మందుబాబులు, జూదరుల దాడులతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా ఇళ్లు ఇవ్వాలి.. ఊసేలేని పనులు

రాజధాని అమరావతి పరిధిలోని 8 ప్రాంతాల్లో 5,024 ఇళ్లు, గుంటూరు సమీపంలోని అడవితక్కెళ్లపాడులో 4,192, వెంగళాయపాలెంలో 1,888, పొన్నూరులో 2,368, తెనాలిలో ఫేజ్- 1లో 848, మంగళగిరిలో 1,728, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 4,512, నరసరావుపేటలో 1,504, ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. కాగా వెంగళాయపాలెంలో ఫేజ్- 2 కింద 1,392, సత్తెనపల్లిలో 160 ఇళ్లు లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయి. తెనాలిలో ఫేజ్- 2లో 1,008, చిలకలూరిపేటలో ఫేజ్- 2లో 1,008 ఇళ్లు, రేపల్లెలో 1,344, వినుకొండలో 1,440, పిడుగురాళ్ల కొండమోడులో 2,832, మాచర్లలోని గొర్రెలమండీలో 1,056, ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. అద్దంకిలో 863 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. గత ఐదేళ్లు ఎలాంటి పనులూ జరగలేదు. రేపల్లె మండలం అరవపల్లి సమీపం, రేపల్లెలోని రెండో వార్డులో 1373 టిడ్కో ఇళ్లు మంజూరైనా పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదు. గత ఐదేళ్లు పాడుబెట్టడంతో టిడ్కో ప్రాంగణం చుట్టూ భారీఎత్తున పిచ్చి మొక్కలు మొలిచి దర్శనమిస్తున్నాయి పిడుగురాళ్లలో సుమారు 4 వేలకు పైగా టిడ్కో గృహాలు మంజూరు కాగా 2018 నాటికి 2,832 గృహాల్లో సుమారు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. విద్యుత్, రోడ్లు, డ్రైయినేజి తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ గృహప్రవేశాలకు ముందుకు రాలేదు. సత్తెనపల్లిలోని భీమవరం డొంక రోడ్డులో 160 వరకు గృహాలను నిర్మించగా విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రహరీ నిర్మాణం కూడా జరగాల్సి ఉంది. మాచర్లలో 1056 టిడ్కో గృహాల పనులు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మందుబాబులకు నిలయాలుగా మార్చుకున్నారు. వైసీపీ పాడుపెట్టిన ఇళ్లతో పాటు గతంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ఇళ్లను చంద్రబాబు అందిస్తారని లబ్ధిదారులు పది నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు కూడా టిడ్కో ఇళ్లపై హామీలు ఇచ్చి ఉన్నారు. అయితే ఇప్పటి వరకు టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ముందుకు రాకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



మాచర్ల పట్టణంలోని టిడ్కో గృహాలు



సత్తెనపల్లిలోని భీమవరం రోడ్డులో ఉన్న టిడ్కో గృహాలు

జాతీయస్థాయిలో పీవీఆర్ విద్యార్థిని ప్రతిభ



ట్రోఫీతో ఆముక్త

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల విద్యార్థిని ఆముక్త జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలలో సత్తా చాటారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆముక్త ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 22వ జాతీయ స్థాయి మహిళా చాంపియన్‌షిప్ పోటీలలో అండర్-13 విభాగంలో ఆంధ్రజట్టు తరుఫున పోటీల తలపడి కాంస్య పతకాన్ని సాధించారు. జనవరిలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలలో పదమూడేళ్ళ వయస్సు ఓపెన్ విభాగంలో ప్రపంచ స్థాయిలో 11వ స్థానంలో నిలవగా, తాజాగా జరిగిన పోటీలలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్టలు చాటారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈవో కిరణ్‌కుమార్, ఆముక్తను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆగని జామాయిల్ అక్రమ రవాణా

పట్టించుకోని అధికారులు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ అక్రమ రవాణా ఆగడం లేదు. తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి యథేచ్ఛగా జామాయిల్ కర్రను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటు న్నారు. మండలంలోని పెదరాజుపాలెం పంచాయతీ పరిదిలోని నలజనంపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ తోటలను అక్రమంగా నరికి లారీల ద్వారా తరలిస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యారు. నలజనంపాడులోని సర్వే నెంబర్లు 204/2, 204/3,205/2,205/3లో గల అగ్రిగోల్డ్ సంస్థ జామాయిల్ తోటలను సాగుచేసింది. గత రెండు రోజుల నుంచి లింగసముద్రం మండలానికి చెందిన ఓవ్యక్తి కర్రను తరలిస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. గతంలో అగ్రిగోల్డ్‌కు భూములు అమ్మిన వ్యక్తి తన పేరుతో ఆ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని జామాయిల్ కర్రను తరలించుకొంటున్నాడని గ్రామస్థులు తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తులన్నీ సీఐడి ఆధీనంలో ఉన్నప్పటికీ జామాయిల్ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికా రులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జామాయిల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

100 మందికి కంటి వైద్యపరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంకొల్లు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టరు బాష రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరం అని గుర్తించారు.వీరికి ఉచితంగా కారంచేడు కంటి హాస్పిటల్‌లో ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ చెప్పారు. 100 మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల



రంగుల విద్యుత్ దీపాలతో ఆలయం

చినగంజాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ సెంటర్‌లోని శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్లను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామికి వేకువజాము నుంచే పంచామృతాభిషేకాలు, ఆకుపూజలు, ప్రత్యేక పూజలు చేశారు. పూజారి మాజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామిని పలు రకాల పూలమాలలతో అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



పర్చూరులో జనసేన జండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పర్చూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జనసైనికులు కూటమి నేతలతో కలసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక బొమ్మల సెంటర్‌లోని వంగవీటి మోహన్‌రంగా, ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జనసేన పార్టీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారీకేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, తోట మణి, తులసి చంటి, తులసి అప్పారావు, కందా సురేంద్రబాబు, అచ్చెకోలు, ముత్యాల శ్రీనివాసరావు, బోగాది మోహన్, రంగిశెట్టి మారుతి, గోగుల శ్రీనివాసరావు, దాసరి సాంబయ్య, టీడీపీ మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, వడ్డిముక్కల అబ్రహం, నలిగిల కిషోర్ పాల్గొన్నారు.

చీరాలలో...

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు చీరాల నుంచి జన సైనికులు, వీర మహిళలు భారీగా తరలి వెళ్లారు. కార్యదర్శి గూడూరు శివరామప్రసాద్, లక్కాకుల లక్ష్మీ, కిషోర్ ఉన్నారు.

కడవకుదురులో...

చినగంజాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో నాయకులు కట్టిబోయిన సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి హరిబాబులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాత్రికి ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా పిఠాపురంలో జరుగుతున్న ఆవిర్భావ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుర్రి వాసుదేవరావు, షేక్ జిలాని, అనంత యశ్వంత్, చందు విజయ్‌కుమార్, పూల అనిల్, కమ్మెల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మీరు ఊ.. అంటే జడ్పీ నుంచి పంపేస్తా..

నాతో సహా అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు అందరిపై విచారణ జరపాలి

చంద్రబాబు, పవన్ సంయుక్తంగా కేడర్‌కు భరోసా ఇవ్వాలి

జనసేన సభలో జగన్‌పై నిప్పులు చెరిగిన బాలినేని



పిఠాపురం సభలో మాట్లాడుతున్న బాలినేని

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'మీరు(పవన్) ఊ అంటే ప్రకాశం జిల్లా పరిషత్ పాలకమండలి నుంచి కూడా వైసీపీని తరిమేస్తాం' అని బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై మరోసారి నిప్పులు చెరిగిన మాజీ మంత్రి జిల్లాకు సంబంధించి రాజకీయంగా కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి గుడ్‌బై చెప్పి జనసేనలో చేరిన బాలినేని శుక్రవారం పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. జిల్లా సమస్యలను ఆయన ప్రస్తావిస్తూ ఒంగోలులో కార్పొరేషన్‌లో 20 మంది వైసీపీ కార్పొరేటర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు జనసేనలో చేరిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్‌కల్యాణ్ ఓకే అంటే జిల్లా పరిషత్‌పై పెత్తనం చేస్తున్న వైసీపీ చైర్‌పర్సన్‌ను కూడా గద్దె దించుతామని స్పష్టం చేశారు. కొద్దిరోజుల క్రితం మంగళగిరిలో పవన్‌ను కలిసిన బాలినేని జిల్లాలో ఆయా నియోజకవర్గాల వారీ స్థానిక సంస్థలను కూటమి పార్టీలు కైవసం చేసుకునే విధంగా వైసీపీ నుంచి జనసేనలో చేరే వారి విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్‌ల పాలకమండలి కాలపరిమితి నాలుగేళ్లు పూర్తికావడంతో వారిని అవిశ్వాస తీర్మానంతో తొలగించే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో బాలినేని తన ప్రసంగంలో జడ్పీ చైర్‌పర్సన్‌ను తొలగిస్తామని, జనసేన (కూటమి) పరిధిలోకి తెస్తామని అనడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో బాలినేని వ్యాఖ్యలు జిల్లాలో చర్చనీయాంశమయ్యాయి.

బడా నేతలపై దృష్టిపెట్టాలి

ఇదే సందర్భంలో బాలినేని వైసీపీ అధినేత జగన్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. అప్పటి ఎంపీ రఘురామకృష్ణమరాజును కొట్టించి నానాహింసలు పెట్టిన జగన్ నేడు వంశీ, పోసాని కృష్ణ మురళీలను అరెస్టు చేస్తే పరామర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం సాదాసీదా కార్యకర్తలను అరెస్టు చేయడం పక్కనబెట్టి వైసీపీ ప్రభుత్వంలో అవినీతితో కోట్లు సంపాదించిన బడా నేతలపై దృష్టిపెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అవసరమైతే తనతోపాటు అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల పాలనపై విచారణ జరపాలని కోరారు. తాను జనసేనలో చేరితే కూటమి పార్టీల మధ్య విభేదాలు వస్తాయని కొందరు ప్రచారం చేశారని, తాను పదవుల కోసం చేరలేదన్నారు. పవన్‌ను తనతో సినిమా తీసే అవకాశం మాత్రమే ఇవ్వాలని అడిగానని, తన ద్వారా కూటమి పార్టీల మధ్య విభేదాలు వచ్చే అవకాశం లేకుండా పనిచేస్తానని చెప్పారు. జగన్ చేసిన పాపాల ఫలితమే ఆయన్ను వెంటాడుతున్నాయని గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. అలాగే కొన్ని నియోజకవర్గల్లో జనసేన కార్యకర్తలు సరైన గుర్తింపు లేక ఇబ్బందిపడుతున్నారని, ఈ విషయమై చంద్రబాబు, పవన్‌లు సంయుక్తంగా సమావేశం పెట్టి ఇబ్బందులు కల్పిస్తున్న ప్రజాప్రతినిధులను హెచ్చరిస్తూ కార్యకర్తలకు అండగా సంయుక్త ప్రకటన చేయాలని కోరారు.

శింగరకొండకు పోటెత్తిన భక్తులు



స్వామి దర్శనం కోసం భక్తుల బారులు





లక్ష్మీనరసింహస్వామి, ధ్వజస్తంభం వద్ద పూలతో అలంకరించిన జై శ్రీరామ్

సత్రాలలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం

అద్దంకి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. గతంలో కంటే భిన్నంగా ఈ ఏడాది పగలు సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వాములను దర్శించుకున్నారు. దీంతో శింగరకొండ వద్ద శుక్రవారం ఉదయం నుంచే భక్తులు స్వామి వార్ల ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. 12వ తేదీ ప్రారంభమైన తిరునాళ్ల ఉత్సవాలు మూడు రోజుల పాటు సాగాయి. శుక్రవారం ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సుప్రభాత సేవ, బిందె తీర్థం, ప్రాతఃకాలార్చన పూజలు చేశారు. దేవస్థాన వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులచే మన్యుసూక్త పారాయణం, హోమం నిర్వహించారు. కూచిపూడి నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు స్వామి వారి దివ్య దర్శనం నిర్విరామంగా కొనసాగింది. ధ్వజ స్తంభం వద్ద, ముఖ ద్వారం వద్ద పూలతో తెలుగు, ఇంగ్లిషు అక్షరాలతో అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ఫెస్టివల్ ఆఫీసర్ రమణమ్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొండపై దేవాలయం వరకు భక్తులకు అద్దంకిలోని భవిష్య స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. అన్ని సామాజిక వర్గాల అన్నదాన సత్రాలలో భక్తులకు శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అంజన్న

మజ్జిగ, మంచి నీళ్ల పంపిణీ

రోటరీక్లబ్ శింగరకొండ, వాసవీ క్లబ్, వనితాక్లబ్, జువారి సిమెంట్, ఎల్ఐసీ తదితర సేవాసంస్థల ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ ప్యాకెట్‌లు, మజ్జిగ ప్యాకెట్ లు పంపిణీ చేశారు. పులిహోర పంపిణీ చేశారు.

భారీ బందోబస్తు

తిరునాళ్ల సందర్భంగా చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 2 డ్రోన్‌లు, 70 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. నలుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 46 మంది ఎస్సైలు, 650 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అద్దంకి, ఒంగోలు, వినుకొండ, నర్సరావుపేట, బాపట్ల డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్, శింగరకొండ వద్ద 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, కాకతీయ కమ్మ సత్రం వద్ద పలుసార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది.



ఇళ్లు సరే.. సౌకర్యాలు ?

(3వ పేజీ తరువాయి)

వీరి గోడు పట్టించుకున్న వారే లేరు.

- చిలకలూరిపేట చెరువురోడ్డులో 52 ఎకరాల్లో టిడ్కో సముదాయంలో వసతులు లేని కారణంగా 4,612 గృహాలకు రెండు వేల మంది కూడా నివాసం ఉండడం లేదు. పట్టణానికి 4 కి.మీ దూరంలో ఉండటంతో అక్కడకు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదు. మురుగు కాల్వల నిర్మాణం జరగలేదు. వీధి దీపాలు, నీటి వసతి కల్పించింది. ఆస్పత్రి, పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది పట్టణంలోనే నివాసం ఉంటున్నారు.

- సీఆర్డీఏ పరిధిలో కృష్ణయ్యపాలెంలో టిడ్కో ఇళ్లకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు లేదు. కంకరతో తాత్కాలిక రోడ్డు వేసిసరిపెట్టారు. మంత్రి లోకేశ్ చొరవతో ఇక్కడ కొంతవరకు తాగునీటి సమస్య తాత్కాలికంగా తీరుతోంది. దొండపాడులో మందుబాబులు, జూదరుల దాడులతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా ఇళ్లు ఇవ్వాలి.. ఊసేలేని పనులు

అమరావతి పరిధిలోని 8 ప్రాంతాల్లో 5,024 ఇళ్లు, గుంటూరు సమీపంలోని అడవితక్కెళ్లపాడులో 4,192, వెంగళాయపాలెంలో 1,888, పొన్నూరులో 2,368, తెనాలిలో ఫేజ్- 1లో 848, మంగళగిరిలో 1,728, చిలకలూరిపేటలో4,512, నరసరావుపేటలో 1,504, ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు.వెంగళాయపాలెంలో ఫేజ్- 2 కింద 1,392, సత్తెనపల్లిలో 160 ఇళ్లు లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయి. తెనాలిలో ఫేజ్- 2లో 1,008, చిలకలూరిపేటలో ఫేజ్- 2లో 1,008 ఇళ్లు, రేపల్లెలో 1,344, వినుకొండలో 1,440, పిడుగురాళ్ల కొండమోడులో 2,832, మాచర్లలోని గొర్రెలమండీలో 1,056, ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. అద్దంకిలో 863 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. గత ఐదేళ్ల ఎలాంటి పనులూ జరగలేదు. రేపల్లె మండలం అరవపల్లి సమీపం, రేపల్లెలోని రెండో వార్డులో 1373 టిడ్కో ఇళ్లు మంజూరైనా పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. గత ఐదేళ్లు పాడుబెట్టడంతో టిడ్కో ప్రాంగణం చుట్టూ భారీఎత్తున పిచ్చిమొక్కలు మొలిచి దర్శనమిస్తున్నాయి పిడుగురాళ్లలో సుమారు 4 వేలకు పైగా టిడ్కో గృహాలు మంజూరు కాగా 2018 నాటికి 2,832 గృహాల్లో సుమారు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. విద్యుత్, రోడ్లు, డ్రెయినేజి వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ గృహప్రవేశాలకు ముందుకు రాలేదు. సత్తెనపల్లిలోని భీమవరం డొంక రోడ్డులో 160 వరకు గృహాలను నిర్మించగా విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రహరీ నిర్మాణం కూడా జరగాల్సి ఉంది. మాచర్లలో 1056 టిడ్కో గృహాల పనులు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మందుబాబులకు నిలయాలుగా మార్చుకున్నారు. వైసీపీ పాడుపెట్టిన ఇళ్లతో పాటు గతంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ఇళ్లను చంద్రబాబు అందిస్తారని లబ్ధిదారులు పది నెలలుగా ఎదురు చూస్తున్నారు.

అవీఇవీ

ఎస్టీలకు ప్రాధాన్యత కల్పించాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 37 లక్షల గిరిజన జనాభాలో 10లక్షలు యానాదులు ఉన్నారని, వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని జాండ్రపేట కన్యకాపరమేశ్వరి మండపంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా, అభివృద్ధి పరంగా వెనుకబడి ఉన్నందున ఎస్టీల వర్గీకరణ జరగాలన్నారు. ఈక్రమంలోనే ఏప్రిల్ 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చేవూరు సుబ్బారావు, పెద బ్రహ్మయ్య, రాజా, హనుమంతరావు, మురళీ, చెంచయ్య, కె మురళీ, సతీష్‌చంద్ర, ఉష, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

వేటపాలెం/చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా టీడీపీ సభ్యత్వ కార్డులు నమోదు చేయించినట్లు వేటపాలెం సీనియర్ నాయకులు నాపిక వీరభద్రయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామన్నపేటలో ఇటీవల నమోదు చేసుకున్న సభ్యులకు ఆయన కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌రావు, బాలచంద్ర, కృష్ణ, లింగమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దేవాలయాలపై పెరిగిన దాడులు



మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

అద్దంకి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా హిందూ ధర్మం, దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయని బీసీవై పార్టీ రా ష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్ చెప్పారు. శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ఆయనపాల్గొన్న అనంతరం అద్దంకిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హిందువులు జరుపుకునే పండుగలపై ఆంక్షలు పెరగటం దురదృష్టకరమన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

- మరొకరికి గాయాలు



బండారు బాబు మృతదేహం

సంగెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం ఢీకొని ఒకరు మృతి, మరొకరికి గాయాలైన సంఘటన శుక్రవారం వరంగల్ జి ల్లా సంగెం మండల కేంద్రం సమీపంలో జరిగింది. మండల కేంద్రం లో నివసిస్తున్న తాపీ మేస్త్రీ తన మిత్రుడితో కలిసి మండలంలోని తిమ్మాపురంలో పని ముగించుకొని బైక్‌పై సంగెంకు వస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరంగల్ నుంచి తిమ్మాపురం వైపు వెళ్తున్న వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బండారు బాబు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదే జిల్లా ఉలవపాడు గ్రామానికి చెందిన పులగర శివమణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శివమణిని 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ఎస్సై నరేష్ బండారు బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలించారు. బాబు భార్య లక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీసీ ఫుటేజీల ద్వారా బొలెరో వాహనాన్ని గుర్తించినట్లు ఎస్సై చెప్పారు. బాబుకు ఇద్దరు పిల్లలున్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్‌పై సమరం'



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వరరావు స్థానిక దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు అవగాన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని తెలిపారు. అలాగే హోటల్ యాజమాన్యాల వారు ప్లాస్టిక్‌కు బదులుగా అరటి ఆకులు, ఇస్తరాకులు, సిల్వర్ కవర్లు వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రాణాంతకమైన ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం ద్వారా పశువులు మరణిస్తున్నాయని, అలాగే మనుషులు క్యాన్సర్ బారిన పడతారని సూచించారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్‌సేవ

సంతనూతలపాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీదేవి,భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం స్వామివార్లను వేదపండితులు పరాంకుశం ప్రసాద్‌చార్యులు, పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం యాగశాలవైదిక కార్యక్రమాలను, దీపాలంకరణ, ఊంజల్‌సేవ చేశారు. తదుపరి గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.



స్వామి ఊంజల్‌సేవలో పాల్గొన్న భక్తులు

మనస్తాపంతో వృద్ధుడు బలవన్మరణం

బుర్లవారిపాలెం(చీరాల), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఓ వృద్ధుడు బలవన్మరణం చెందాడు. ఈఘటన మండల పరిధిలోని బుర్లవారిపాలెంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొంత గొర్ల చినవెంకటేశ్వర్లు(65) అలియాస్ స్వాములుకు భార్య బాపమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇతను గ్రామంలోనే ఆకు కూరలు సాగు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా అతను అనారోగ్యం బారినపడటంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వైద్యం చేయించారు. అయినా ఫలితం లేదు. దీంతో గతంలోనే ఆయన పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి దిగాడు. ఈక్రమంలోనే శుక్రవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి బలవన్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వివాహేతర సంబంధం.. దాడి.. కానిస్టేబుల్ సస్పెండ్

పేరాల(చీరాల), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమె బంధువులపై ఘర్షణకు పాల్పడిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయడంతో పాటు సస్పెండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చీరాలకు చెందిన కానిస్టేబుల్ కొంత కాలంగా డీఎస్పీ కార్యాలయంలో కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఇతనికి పేరాల్లోని ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈక్రమంలో గురువారం రాత్రి ఆమె బంధువులతో తీవ్రంగా ఘర్షణ పడి చివరకు దాడులు చేసుకున్నారు. ఈక్రమంలో రెండు వర్గాల వారు ఏరియా హాస్పిటల్‌కు చేరి చికిత్స పొందారు. విచారణ చేపట్టిన అధికారులు అతనిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా సస్పెండ్ చేశారు.

31మందికి ఐపీ నోటీసులు పంపించిన మహిళ

యద్దనపూడి/మార్టూరు, మార్చి14(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లిలో ఒక మహిళ 31 మందికి ఐపీ నోటీసులను కోర్టు ద్వారా ఇచ్చినట్లు తెలిసింది. దాదాపు 50 లక్షల రూపాయలు దాకా వారికి ఇవ్వాల్సి ఉండగా ఐపీ నోటీసులు పంపినట్లు బాధితులు తెలిపారు. ఒక్కొక్కరి దగ్గరనుంచి లక్ష నుంచి రూ. 3 లక్షలు దాకా అప్పుగా తీసుకున్నట్లు తెలిసింది. కొంతమంది పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించేపనిలో ఉన్నారు.

స్థలాలు మంజూరు చేయాలి

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న నిరాశ్రయులకు నివేశన స్థలాలు కేటాయించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి చెప్పారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మునిసిపల్ పరిధిలోని 27వ వార్డు జయశంకర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు, నాయకులు వసంతరావు, జయరాజ్, సుబ్బారావు పాల్గొన్నారు.



పర్చూరు నడిబొడ్డున ప్రభుత్వానికి కోట్ల విలువ జేసే ఎకరా భూమి నిరుపయోగంగా మారింది. భూమి ఖాళీగా ఉండటంతో వర్షాకాలంలో నీరు నిల్వఉండటం, పరిసరాలలోని మురుగునీరు అందులో చేరటం వల్ల గడ్డి, ముళ్లచెట్లు పెరిగాయి. దీంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్ఎస్పీ శాఖకు మూడు దశాబ్దాల క్రితం 2ఎకరాల స్థలం కేటాయించారు. అందులో చిన్న భవనాన్ని కార్యాలయం కోసం నిర్మించారు. 20 సెంట్లు పంచాయితీరాజ్ సబ్‌డివిజన్ అతిథి గృహానికి కేటాయించారు. మరో 80 సెంట్ల భూమిని ఆర్టీసీ అవసరాల కోసం ఇచ్చారు. మిగిలిన ఎకరం భూమి ఎన్ఎస్పీ పరిధిలో ఉంది. ఈస్థలం ప్రధాన రహదారికి పక్కనే ఉండటంతో దీని విలువ సుమారు రూ.2 కోట్లపైనే పలుకుతోంది. ప్రస్తుతం ఎన్ఎస్పీ భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో ప్రస్తుతం ప్రయివేట్ భవనంలో అరకొర వసతుల నడుమ ఎన్ఎస్పీ కార్యాలయం కొనసాగిస్తున్నారు. దీంతో సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇంతటి విలువైన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవటంతోపాటు, ఎన్ఎస్పీ శాఖకు సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-పర్చూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)

ఆరుతడులకు నీరు అందించేందుకు ఏలూరి కృషి

ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా కార్యాచరణ

అధికారులతో ఎత్తిపోతల పథకాల పరిశీలన



అడుసుమల్లి పరిధిలోని ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పర్చూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆరుతడులకు నీరందించి రైతాంగాన్ని ఆదుకునే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొద్దిపాటి మరమ్మతులకు కూడా నోచుకోక అనేక లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవ చూపారు. దానిలో భాగంగా రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎత్తిపోతల పథకాల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి ఉమాదేవి ఎత్తిపోతల పథకాన్ని నిర్వాహకులు అడ్డగడ వీరబ్రహ్మం, అడ్డగడ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పరిశీలించారు.

పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చేయాల్సిన మరమ్మతులపై ప్రతిపాదన చేశారు. అనంతరం ఇనగల్లులోని ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మువ్వా వీరయ్య, పోపూరి శ్రీనివాసరావు, అడ్డగడ శ్రీనివాసరావు, నాగరాజు, కారుమంచి శ్రీనివాసరావు, కాకాని నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

అదనపు సాయంతో ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడండి

అద్దంకిటౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందించే అదనపు సాయాన్ని లబ్ధిదారులకు తెలియజేసి ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ పథకం సంబంధించి ఏఈ కిరణ్‌కుమార్, ఇంజనిరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2019 నుండి 2024 మధ్య కాలంలో హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, డబ్బులు జమ కాక నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. అలాంటి గృహాలను సర్వే చేయాలని చెప్పారు. ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తుందన్నారు.

పెండింగ్ గృహాలకు చక్కనైన వెసులుబాటు

వేటపాలెం(చీరాల), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గతంలో గృహ నిర్మాణాలు మధ్యలో నిలిపివేసిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం చక్కని అవకాశం కల్పించిందపి మండల ప్రత్యేక అధికారి రాజా దెబోరా చెప్పారు. ఎంపీడీవో రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరాల మండలంలో..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను గ్రామాల్లో పారదర్శకంగా అమలు చేయాలని ఈవోఆర్డీ రామకృష్ణ చెప్పారు. ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు మండల కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కారంచేడులో..

కారంచేడు మండల పరిధిలో పూర్తి కాని పక్కా గృహాలను గుర్తించి పూర్తయ్యేలా చర్యలు తీసుకువాలని ఎంపీడీవో నేతాజీ చెప్పారు. కారంచేడు ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిసెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బి. సింగయ్య

యద్దనపూడిలో...

యద్దనపూడి/మార్టూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0లో గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఇళ్లు నిర్మించుకుంటూ, నిధులులేక అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అదనంగా సాయం అందిస్తోందని మండల హౌసింగ్ ఏఈ రాహుల్ చెప్పారు. శుక్రవారం యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ బి ప్రకాష్‌రావు సమావేశం నిర్వహించారు. ఏఈ రాహుల్ మాట్లాడుతూ మండలంలో 219 మంది గృహనిర్మాణ లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

పర్చూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : హోలీ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంతో ఆనందంగా రంగులు, రంగునీళ్ళు చల్లుకుంటూ సందడి చేశారు.

బల్లికురవలో....

బల్లికురవ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల వద్ద శుక్రవారం హోళి పండుగ వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస పనులకు వచ్చిన కార్మికులు ఈపండగను ఎంతో ఉల్లాసంగా జరుపుకొన్నారు. వేమవరం, మల్లాయపాలెం, బల్లికురవ, కొండాయపాలెం, చెన్నుపల్లి గ్రామాల పరిధిలో ఉన్న గ్రానైట్ కార్మికులు రోడ్లపైకి వచ్చి పండగను కోలాహలంగా నిర్వహించారు.

అద్దంకిలో...

అద్దంకి, మార్చి14(ఆంధ్రజ్యోతి): హోలీని శుక్రవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. అద్దంకి పట్టణంలోని పలు కాలనీలలో చిన్నారులు, యువకులు, మహిళలు రంగు నీళ్లు చల్లుకున్నారు.

చినగంజాంలో...

చినగంజాం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో హోలి పండుగను ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా చినగంజాం, కడవకుదురు, సోపిరాల, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు అనే తేడా లేకుండా రంగుల పండుగను నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. చినగంజాం గ్రామంలోని రాజస్థాన్ వాసులు గులాములు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు.



అద్దంకిలో రంగు నీళ్లు చల్లుకుంటున్న చిన్నారులు

విద్యార్థులకు అట్టలు, పెన్నుల బహూకరణ

పంగులూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పర్చూరు రోటరీ క్లబ్ ప్రతినిధులు పరీక్ష రాసేందుకు అవసరమైన ప్యాడ్, పెన్, స్కేల్, పెన్సిల్స్ అందచేశారు. మొత్తం 57 మంది బాలబాలికలకు సుమారు 7,500 విలువ చేసే వస్తువులు అందచేసి తమ వితరణ చాటుకున్నారు. దాతలు నర్రా వెంకటేశ్వర్లు సతీమణి లక్ష్మీసుధ సౌజన్యంతో ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, ఉపాధ్యాయులు కాల్వ సోమశేఖర్, చిలుకూరి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, పీడీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్ బహూకరించిన రోటరీ ప్రతినిధులు

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని 31వ వార్డు రోశయ్య కాలనీలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు జరుగుతున్నట్లు స్థానికులు కొండ్రు కిరణ్ తహసీల్దార్ గోపీకృష్ణకు ఫిర్యాదు చేశారు. వార్డులో ప్రభుత్వ స్థలాలు, రోడ్లు మార్జిన్‌లు ఆక్రమణలపై గతంలో పలుమార్లు వివాదాలు జరిగాయి. తాజాగా మరో ఆక్రమణలో విషయం మళ్లీ వెలుగులోకి వచ్చింది. దీంతో శుక్రవారం వార్డులో నివాసితులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.దీనిపై విచారణ చేపడతామని తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

అవీఇవీ

నేటి నుంచి పూనూరులో రాజగోపురం ప్రతిష్ఠా కార్యక్రమాలు

యద్దనపూడి/మార్టూరు, మార్చి14,(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో శనివారం నుంచి శ్రీత్రిపురసుందరి సమేత శ్రీత్రిపురాంతకస్వామి, భద్రకాళీ సమేతవీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రాచకొండ హనుమంతురావు,రాధిక దంపతులు నిర్మించిన రాజగోపురం పంచ విమాన శిఖరం ప్రతిష్ఠాసహిత మహా కుంభాభిషేక మహోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేస్తారు.

పది పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు



సీజింగ్ రూంకు తరలిస్తున్న పది పరీక్ష పత్రాలు

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వచ్చే సోమవారం నుంచి జరుగనున్న పది పరీక్షలకు సంబంధించి సంబంధిత అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. చీరాలలో 10, వేటపాలెంలో పరీక్షా కేంద్రాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. సెట్ 1 పరీక్ష పత్రాలు శుక్రవారం ఆయా కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్లకు చేరాయి. పోలీసుల సమక్షంలో కస్టోడియన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్స్ సీజింగ్ రూంలో ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. అలాగే సెట్ 2 పత్రాలు శనివారం రానున్నాయి. పరీక్ష ప్రారంభం రోజు నుంచి సంబంధిత పత్రాన్ని గంట ముందుగా అధికారులు పరీక్ష కేంద్రానికి చేర్చనున్నారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం అన్ని గ్రామాలలో స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు పీ 4 సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

నేడు, రేపు స్త్రీ, పురుష ఖోఖో జట్ల ఎంపిక

పంగులూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : పంగులూరులో ఈ నెల 15, 16 తేదీలలో రాష్ట్రస్థాయి స్త్రీ, పురుష ఖోఖో జట్ల ఎంపిక జరుగుతుందని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి చెప్పారు. శని, ఆదివారాలలో జరిగే ఎంపిక కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 100 మంది పురుషులు, 100 మంది స్త్రీ క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపిక కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బి.సి.హెచ్.గరటయ్యతోపాటు శాప్ పరిశీలకులు, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథ రెడ్డి, అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ట్రెజరర్ కె.హనుమంతరావు పాల్గొంటారని తెలిపారు.

ఎంపికయిన జట్లకు 17 నుంచి 28 వరకు శిక్షణ

ఎంపికయిన స్త్రీ, పురుష ఖోఖో జట్లకు ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు పంగులూరు ఎస్ఆర్ఆర్ అకాడమీలో శిక్షణ ఇస్తామని కళాశాల పీడీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు. శిక్షణ అనంతరం ఇరు జట్లు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలోని పూరి పట్టణంలో జరిగే 57వ సీనియర్ జాతీయస్థాయి స్త్రీ, పురుష ఖోఖో పోటీలలో పాల్గొంటాయని చెప్పారు.

శింగరకొండ తిరునాళ్లలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు

అద్దంకి, మార్చి14(ఆంధ్రజ్యోతి): శింగరకొండ 70 వార్షిక తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వంశీకృష్ణతో పాటు పలు విభాగాల వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రధానంగా షుగర్, బీపీ, ఇతర సాధారణ వ్యాధులకు కూడా పరీక్షలు నిర్వహించారు. అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్ కూడా అందుబాటు లో ఉంచారు.

యువపారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి రామకృష్ణ

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎంఈ ద్వారా యువపారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించి ఉపాధి అవకాశాలను మెరుగు పరచనున్నట్లు కేవీఐసీ డైరెక్టర్ ఎస్ గ్రీస్, డీఐసీ రామకృష్ణ చెప్పారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీలు కోటిరెడ్డి, వాణి, బీసీ కార్పొరేషన్ ఏఈవో చిట్టిబాబు, డీపీఎం లక్ష్మణాచారి, ఏపీఎంలు మధు, అంజిబాబు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఎంఎల్‌హెచ్‌పీ బదిలీ

యద్దనపూడి,(మార్టూరు)మార్చి14(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాగర్లమూడి విలేజ్ హెల్త్ క్లినిక్ నందు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సరోజినిని కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రీజనల్ డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ గుంటూరు నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉత్తర్వులు వచ్చినట్లు శుక్రవారం వైద్యాధికారి శ్రీహర్ష తెలిపారు.